రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు(కిలోరూ.ల్లో) టమాటా రూ.31, వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 60, బజ్జీమిర్చి 65, కాకరకాయ 38, బీరకాయ 40, క్యాబేజి 21, బీన్స్ 95, క్యారెట్ 40, కాలిఫ్లవర్ రూ.23, దొండకాయ 18, చిక్కుడుకాయ 55, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 23, క్యాప్సికం 65, ఆలుగడ్డ రూ.33, కీరా 23, దోసకాయ 28, సొరకాయ 11, పొట్లకాయ 18, కంద 55, ఉల్లిపొరక 85, ఉల్లిగడ్డ 29, మామిడికాయ రూ.10 నుంచి 15, అరటికాయ రూ.8 నుంచి 9, చామగడ్డ 40, ముల్లంగి 4 నుంచి 5, చిలగడదుంప 35, గుమ్మడికాయ 25, నిమ్మకాయలు 50 నుంచి 60, మునగకాయలు 5 నుంచి 6, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 240, చింతపండు 120, పండుమిర్చి 80, ఉసిరి 60, వేరుశెనగ నూనె 165, పామాయిల్ నూనె 97గా ఉన్నాయి.

లయన్స్ క్లబ్‌కు కార్యవర్గ ఎన్నికలపై సమీక్ష



సమావేశంలో మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ తదితరులు

మోతీనగర్: లయన్స్ క్లబ్ బంజారాహిల్స్‌శాఖ నూతన కార్యవర్గానికి త్వరలో ఎన్నికలు నిర్వహిస్తామని లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు మాజీ కౌన్సిలర్ సీహెచ్. సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం లయన్స్ క్లబ్ బంజారాహిల్స్‌శాఖ బ్రేక్‌ఫాస్ట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో ప్రస్తుత కమిటీ ముగుస్తుండటంతో త్వరలో నూతన కమిటీని ఎన్నుకోవడానికి నూతన సభ్యత్వంతో పాటు ప్రస్తుతం ఉన్న సభ్యత్వాన్ని రెన్యూవల్ చేస్తున్నామన్నారు. నాగుల సత్యం గంగపుత్ర, జగన్నాథం, కేఆర్‌కే నాగరాజు, టీవీ సుబ్బారావు, కృష్ణయ్య, కై లాస్పతి, శ్రీకాంత్, సుభాష్, మధు తదితరులు పాల్గొన్నారు.

పాలపిట్ట పార్కు పని వేళలు

రాయదుర్గం: కొత్తగూడలోని తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, హైదరాబాద్ బైసైక్లింగ్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే పాలపిట్ట సైక్లింగ్ పార్కులో ఆహ్లాదపూరిత వాతావరణంలో సైకిల్ నడిపే అవకాశం.

పని వేళలు..

- ఉదయం 5.30 గంటల నుంచి 10 గంటల వరకు
- సాయంత్రం 3.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు

సైకిళ్ల అద్దె వివరాలు..

- అడల్ట్స్/కిడ్స్–గంటకు రూ.59
- సొంత సైకిల్ తీసుకొస్తే నాలుగు గంటలకు రూ.59
- నెలవారీ పాస్ రూ.900

గ్రూప్‌-1 కోసం ప్రత్యేక బస్సులు

రాయదుర్గం: నగరంలో నిర్వహించే గ్రూప్‌–1 అభ్యర్థుల కోసం ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సులను నడుపుతోందని గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ మర్యాద మురళీధర్‌రెడ్డి శనివారం తెలిపారు. హెచ్‌సీయూ డిపో ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7.30 గంటల నుంచి లింగంపల్లి, పటాన్‌చెరు బస్టాండ్ల నుంచి పరీక్ష కేంద్రాల రూట్లో ఈ ప్రత్యేక బస్సులను స్పెషల్ బోర్డులతో నడపడం జరుగుతుందన్నారు. రోజువారీగా నడిచే బస్సులతో పాటు ఈ అదనపు బస్సుల ను కూడా నడపాలని ఆర్టీసీ సంస్థ నిర్ణయించిందని పరీక్ష రాసే వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లోక్ అదాలత్‌తో కేసుల పరిష్కారం



కూకట్‌పల్లి కోర్టు ప్రాంగణంలో కేసులను పరిష్కరించిన న్యాయమూర్తి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి కోర్టు ప్రాంగణంలో శనివారం రంగారెడ్డి కోర్టులకు సంబంధించిన న్యాయసేవల కోసం లోక్ అదాలత్ నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు, చెక్ బౌన్స్, తదితర కేసులు, లేబర్ వివాదాల వంటి పలు కేసులను పరిష్కరించారు.

15న శాంతి సరోవర్‌లో ప్రత్యేక సదస్సు

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఈనెల 15న పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ప్రత్యేక సెమినార్ నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే కార్యక్రమంలో 'ప్రాస్పరిటీ ఇన్ బిజినెస్ త్రూ ట్రెజర్స్ ఆఫ్ బ్లెస్సింగ్స్' అనే అంశంపై మౌంట్‌అబూకు చెందిన బి.కె.ఉషాదీదీ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. ఇదే కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ హైదరాబాద్ డైరెక్టర్ బి.కె.కుల్‌దీప్ దీదీ, అరబిందో ఫార్మా లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ హెచ్‌ఆర్ డాక్టర్ యూఎస్‌బీ రాజు, డ్యూక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ రవీందర్ అగర్వాల్, టీహెచ్‌సీసీఎంఏ అజయ్‌కుమార్ అగర్వాల్ పాల్గొంటారు. మరిన్ని వివరాలకు 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

అవగాహనతోనే 'ట్యూమర్'పై విజయం

సాక్షి,సిటీబ్యూరో: మెదడు కణితులతో పోరాటంలో వ్యాధిపై అవగాహనే విజయానికి తొలి మెట్టు అని టాలీవుడ్ నటి డాక్టర్ రూప కొడువాయుర్ అన్నారు. హైటెక్‌సిటీలోని కేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే సందర్భంగా వ్యాధిపై పోరాటంలో విజయం సాధించిన సర్వైవర్స్‌తో శనివారం అవగాహన వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తగిన అవగాహనతో ప్రారంభ దశలోనే రోగ నిర్ధారణ చేసి సరైన చికిత్స అందిస్తే వ్యాధిపై విజయం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి డాక్టర్ రజత్ కుమార్, కేర్ హాస్పిటల్స్, హెచ్ సీఓఓ సునీత్ అగర్వాల్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నల్లకుంటలోని మాత వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పీజీ, బీటెక్ చదువుతున్న పేద విద్యార్థులైన శ్రావణ్, కొండా శివతేజలకు రూ. 17 వేలు, రూ. 10 వేల ఆర్థిక సాయం చేశారు. ఉన్నత చదువుల నిమిత్తం ఈ సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాత వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ వై.మురళీధరుడు మాట్లాడుతూ... విద్యాదానం మహాదానం అని పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం తమ క్లబ్ తరఫున ఆర్థిక చేయూతతో పాటు ఇతర సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. క్లబ్ కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, కేశవచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం..
అప్రమత్తతే కీలకం!

- వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ చర్యలు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా కసరత్తు
- హైరిస్కు ప్రాంతాలు, బస్తీలు, పల్లెల్లో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి
- పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండేలా... కార్యాచరణ ప్రణాళిక
- వారానికి రెండు రోజులు డ్రైడేగా పాటించేలా ప్రజల్లో అవగాహన



సాక్షి, మేడ్చల్ జిల్లా: వర్షాకాలం వచ్చేసింది. దీంతోపాటు అంటువ్యాధులు కూడా వచ్చే ప్రమాదం ఉంది. అయితే ప్రజలు రోగాల బారిన పడకుండా వైద్యారోగ్యశాఖ అధికారులు ముందస్తు చర్యలు ప్రారంభించారు. అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అప్రమత్తమయ్యారు. జలుబు, దగ్గు, జ్వరంతో వచ్చే రోగులకు మందులు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బోదకాలు, మలేరియా, డెంగీ తదితర వ్యాధులకు సంబంధించిన వైద్యులు సర్కారు దవాఖానాల్లో అందుబాటులో ఉండాలని చెబుతూనే.. వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. పాముకాటు చికిత్సలకు కావాల్సిన మందులను జిల్లా వైద్యారోగ్యశాఖ సమకూర్చుకుంటోంది.

◆ గ్రామాలు, బస్తీలపై ప్రత్యేక దృష్టి

మారుమూల గ్రామాలు, బస్తీల ప్రజలకు వైద్యసేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. ఇలాంటి వాటిని గుర్తించిన వైద్యాధికారులు అక్కడి ప్రజలకు మెరుగైన వైద్యమందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే గుర్తించిన హైరిస్కు ప్రాంతాలతోసహా స్లమ్‌లు, బస్తీలు, గ్రామాల్లో ఇంటింటి జ్వర సర్వే నిర్వహించారు. మలేరియా నిర్మూలనలో భాగంగా నివాసితులందరి రక్తనమూనాలు సేకరించారు. అధిక వర్షాల కారణంగా గర్భిణులు ప్రసవ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. వైద్యుల సూచనల మేరకు గర్భిణులు ముందస్తుగా ఆసుపత్రుల్లో చేరాలని అధికారులు సూచిస్తున్నారు.

◆ పారిశుద్ధ్యం మెరుగు...

వర్షాకాలంలో మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. చిన్నపాటి వర్షాలకే వీధులు చెరువులను తలపిస్తాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమవుతాయి. మురుగునీరు, వ్యర్థాలు ఇళ్లల్లోకి చేరటంతో వ్యాధులు సోకుతాయి. వానా కాలం ముగిసే వరకు గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్యం, మురుగునీటి నిర్వహణపై దృష్టి సారించాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

◆ డ్రై డే

వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెంది అనేక రోగాలకు కారణమవుతాయి. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు వారంలో ఒకరోజు(శుక్రవారం) డ్రైడే పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ఇంటింటికీ పంచాయతీ కార్యదర్శి, ఆశా కార్యకర్త, అంగన్వాడీ టీచర్, పారిశుధ్య సిబ్బంది వెళ్లి నీటి నిల్వ వల్ల దోమలు ఏవిధంగా వృద్ధి చెందుతాయనే అంశంపై అవగాహన కల్పిస్తారు.

◆ జాగ్రత్తలు ఇవే...

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి. వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలి. నిల్వ పదార్థాలను తినరాదు. బయటి తినుబండరాలకు దూరంగా ఉండాలి. కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగడం ఉత్తమం. చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. ఓవర్హెడ్ ట్యాంకులు, నీటిసంపులు,నీటిపాత్రలపై నిరంతరం మూతలు ఉంచాలి. వారానికోసారి నీరు నిల్వ ఉన్న పాత్రలు, డ్రమ్ములను ఖాళీ చేసి శుభ్రపర్చాలి.

ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా చర్యలు

వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, బస్తీ, పల్లె దవాఖానాల్లో వైద్యులతోసహా వైద్యారోగ్యశాఖ సిబ్బందిని అప్రమత్తం చేశాం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– డాక్టరు రఘునాథస్వామి, డీఎంహెచ్‌ఓ, మేడ్చల్ జిల్లా

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల తీర్పును గౌరవించి ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ విభాగాల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ వారీగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేద్దామన్నారు. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆయా డివిజన్‌లోని బస్తీలు, కాలనీలు, అపార్టుమెంట్ల వద్ద వర్షపు నీరు నిలువకుండా ఉండేందుకు ముందస్తుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజల ఆదరణ ఎప్పుడూ బీఆర్‌ఎస్ పార్టీకి లభించిందన్నారు. ప్రజలకు మరింత చేరువ కావడం ద్వారా భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. నియోజకవర్గ కో–ఆర్డినేటర్ సతీష్ అరోరా, కార్పొరేటర్లు ముద్దం నర్సింహయాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్‌గౌడ్, జూపల్లి సత్యనారాయణ, మందడి శ్రీనివాసరావు, శ్రీహరి, మాజీ కార్పొరేటర్ బాబూరావు, తూము శ్రావణ్ కుమార్ తదితరలున్నారు.

ఈటలకు సత్కారం



ఈటల రాజేందర్‌ను సన్మానించిన శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

మోతీనగర్: మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్ విజయం సాధించిన సందర్భంగా బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, శ్రీలక్ష్మియాదవ్ ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ.. మూడోసారి దేశ ప్రధానిగా విజయం సాధించిన ఘనత నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు. ఈటల ఉద్యమకారుడిగా, ఆరోగ్య, ఆర్థికశాఖ మంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రానికి ఎంతో సేవ చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. భవిష్యత్తులో మేడ్చల్ పార్లమెంట్ ప్రాంతాన్ని ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. మోహన్‌గౌడ్, కృష్ణ, శర్మ, రామకృష్ణ, శివకుమార్‌యాదవ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై జోనల్ కమిషనర్‌తో చర్చ



జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌తో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, హైదర్ నగర్, కూకట్‌పల్లి డివిజన్‌లలో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌ను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శనివారం కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు డివిజన్లలో నెలకొన్న సమస్యలు, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై జెడ్‌సీతో చర్చించామన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను త్వరగా పూర్తయ్యేలా నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలపై పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. మాన్‌సూన్ సిబ్బందిని అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

జనగామకు సర్వాయి పాపన్న పేరు హర్షణీయం

ఉస్మానియా యూనివర్సిటీ: జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని కాంగ్రెస్ నేత, జైగౌడ ఉద్యమ జాతీయ అధ్యక్షులు డా.వట్టికూటి రామారావుగౌడ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలో ఏర్పడిన ప్రజా పాలన ప్రభుత్వంలో సామాన్య కార్యకర్తనైన నేను సీఎం రేవంత్ రెడ్డిని నెల రోజుల్లో ఆరు సార్లు కలుసుకోవడం ఆనందంగా ఉందని రామారావుగౌడ్ పేర్కొన్నారు.

టైం స్కేల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పని చేస్తున్న టైంస్కేల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ ఆల్ యూనివర్సిటీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో ఉద్యోగాల పర్మనెంట్‌తో పాటు అనేక సమస్యల పై చర్చించి పరిష్కారం కోసం ఆందోళనలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సహాయ కార్యదర్శి మహేందర్, విఠల్, నారాయణ, వెంకటయ్య, కరీం తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కాపాడాలి

లిబర్టీ: ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలని మాతృదేవోభవ సంస్థ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్ కోరారు. భారతీయ సంస్కృతిలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు ఎంతో గొప్ప పేరు ఉందని ఆయన గుర్తు చేశారు. శనివారం లిబర్టీ ప్లాజాలోని సంస్థ కార్యాలయంలో జరిగిన సత్‌సంగ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారాయని విచారం వ్యక్తం చేశారు. చిన్న చిన్న కారణాల వల్ల ఉమ్మడి కుటుంబ వ్యవస్థల్లో వివాదాలు నెలకొని తల్లిదండ్రులను వదిలిపెట్టి పిల్లలు వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచిని పెంచి మానవతను పెంచాలని కోరారు. కుటుంబాన్ని స్మరిస్తూ స్నేహ సంబంధం ఆర్థిక సంబంధాలకు సమాజంలోని మానవాళి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. మాతృమూర్తి పిల్లలను కని పెంచి విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నత శిఖరాలకు చేర్పించడంలో ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. అయితే ప్రస్తుత పిల్లలు తమ తల్లిదండ్రులను విస్మరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పుష్పాంజలి, నంది కొండలరావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



వంట సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

ఆలయానికి విరాళం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లోని శ్రీ వీరాంజనేయ శివాలయం అభివృద్ధికి హనుమాన్ దీక్ష తీసుకున్న స్వాములు తమ వంతు విరాళంగా రూ.35,500 విలువైన వంట సామగ్రిని అందించటం అభినందనీయమని బస్తీ అధ్యక్షుడు చందారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు పేర్ని ధర్మారావు అన్నారు. గత 41 రోజులుగా హనుమాన్ దీక్ష చేపట్టిన స్వాముల బృందం జూన్ 1న హనుమాన్ జయంతి సందర్భంగా దీక్ష విరమణ చేశారు. సుమారు 70 మంది భక్తులు నిత్యం పూజలు చేసుకునేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను చేసి సహకరించింది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆలయానికి కావాల్సిన పలు వంట సామగ్రిని అందజేశారు. ఆలయ చైర్మన్ గడ్డం రాజేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, కోశాధికారి కిరణ్‌కుమార్, బస్తీ ప్రధాన కార్యదర్శి భగవంతరెడ్డి, కోశాధికారి నర్సింహులుముదిరాజ్, సభ్యులు దశరథ్, రాజిరెడ్డి, గురుస్వాములు కృష్ణారెడ్డి, మారుజోడు శంకర్, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా వెలుగులో తెలంగాణ విద్యార్థి ఉద్యమం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ న్యూసెమినార్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మందాల భాస్కర్ అధ్యక్షత వహించగా పుస్తక రచయిత నలమాస కృష్ణ, ప్రొ.కాశీం, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, ప్రొ.ననుమాసస్వామి, ప్రొ.గాలి వినోద్‌కుమార్, ఓయూ పూర్వవిద్యార్థి నాయకులు తదితరులు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు.

'నీట్' పేపర్ లీకేజీపై విచారణ జరపాలి

లిబర్టీ: నీట్ పరీక్షా ఫలితాలపై అనేక అనుమానాలు వెలువడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహణా తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మే 5న నిర్వహించిన పరీక్షకు దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. కాగా ప్రకటించిన ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆరుగురు విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడం, వారి పరీక్షా కేంద్రం ఒకటే కావడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సర ఫలితాలపై, పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు.

హోటళ్ల తనిఖీలు సరే..
సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి ఏమిటి?

బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ

కాచిగూడ: రాష్ట్రంలో ఉన్నతాధికారులు హోటళ్లు, ఆర్‌టీఏ ఆఫీసులు, రిజిస్ట్రార్ తదితర ఆఫీసులు తనిఖీలు చేస్తున్నారు సరే.. మరి విద్యార్థుల సంక్షేమ హాస్టళ్లను, కార్పొరేట్ విద్యా సంస్థలను ఎందుకు తనిఖీలు చేయడం లేదని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల సంక్షేమ హాస్టళ్లలో సరైన భోజన వసతి, మంచినీటి సౌకర్యం లేక విద్యార్థులు రోగాల బారిన పడుతున్నా ప్రభుత్వం, అధికారులు ఎందుకు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా మంది అధికారులు అక్రమ సంపాదనకు అలవాటు పడటంతోనే డబ్బులు వస్తున్న విభాగాల్లోనే తనిఖీలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, విద్యార్థుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆయన తెలిపారు. ప్రతి రోజూ నీళ్లచారు, పురుగుల అన్నం తింటున్నారని, దీంతో అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అందరికి సమాన విద్య అందించేందుకు ప్రభుత్వం వెంటనే ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు రోజురోజుకు పెరిగిపోతుండటంతో వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యార్థుల సమస్యలు సత్వరమే పరిష్కరించే విధంగా సీఎం రేవంత్ రెడ్డి కృషి చేయాలని కోరారు. పెరిగిన ధరలకనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, సంక్షేమ హాస్టళ్లకు స్వంత భవనాలను నిర్మించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. త్వరలోనే బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహించి విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కార్యచరణ ఉద్యమాన్ని ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో చేపడతామని అన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు వంశి, నిఖిల్, ప్రవీణ్, వరుణ్, హరీష్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



మోతీనగర్: బీఆర్‌ఎస్ పార్టీ అల్లాపూర్ డివిజన్ కో–ఆర్డినేటర్ తిమ్మారెడ్డి వీరారెడ్డి శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆశీస్సులు తీసుకున్నారు. తిమ్మారెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే ఆయనతో కేక్ కట్‌చేయించి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి తదితరులున్నారు.

అనారోగ్యంతో గుర్తు తెలియని మహిళ మృతి



సయ్యద్ సమీన మృతదేహం

మోతీనగర్: అనారోగ్యంతో ఓ మహిళ మృతి చెందిన ఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతీనగర్, బోరబండ, ఖాజాబాబా దర్గా ప్రాంతంలో 6న రాత్రి 8 గంటల సమయంలో మహిళ అపస్మారక స్థితిలో ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాల సేకరించారు. ఆమె పేరు సయ్యద్ సమీన(34) భర్త సలీం అని గుర్తించారు. చికిత్స నిమిత్తం ఆమెను ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా.. 7వ తేదీ రాత్రి 10 గంటలకు చికిత్స పొందుతూ మృతి చెందింది. సదరు మహిళ దర్గా ప్రాంతంలో భిక్షాటన చేసుకుంటూ.. జీవనం సాగిస్తుండేదని స్థానికులు చెబుతున్నారు. కుటుంబసభ్యుల వివరాలు తెలియరాలేదని, వివరాలకు 87126 63699 నెంబరును సంప్రదించాలని అల్లాపూర్ సీఐ సామల వెంకట్‌రెడ్డి కోరారు.

వ్యర్థాలను తొలగించండి.!

సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్న స్థానికులు



ఆల్విన్‌కాలనీ నాలా బ్రిడ్జి వద్ద ఇలా..



ఆస్‌బెస్టాస్ కాలనీలో ఎండిపోయిన చెట్ల కొమ్మలు



ఆస్‌బెస్టాస్ కాలనీ పార్కు వద్ద చెత్తని కాలుస్తున్న దృశ్యం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి, ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్, హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీ, బస్తీలోని ప్రతి వీధుల వెంట ప్రధాన రహదారులు, పార్కుల వద్ద, కాలువలు, బ్రిడ్జిలపై చెత్తాచెదారం పారవేయండంతో డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తడి, పొడి చెత్తను వేరుచేసి ఇంటి ముందుకు వచ్చే జీహెచ్‌ఎంసీ రిక్షా కార్మికులకు అందజేయాలని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం వీధుల వెంట వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుందని స్థానికులు చెబుతున్నారు.

గుట్టు చప్పుడు కాకుండా..

రాత్రి వేళల్లో ప్లాస్టిక్ కవర్లు, సంచులు, బస్తాల్లో తీసుకొచ్చి ప్రధాన వీధుల వెంట చెత్తను ఇష్టానుసారంగా పారవేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

◆ అసలే వర్షాకాలం కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు. గతేడాది వర్షాకాలంలో డెంగీ, మలేరియా వంటి వ్యాధుల వ్యాప్తి చెంది అనేక మంది ఆసుపత్రుల పాలవడంతో పాటు మృతి చెందిన ఘటనలు కూడా ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పరిసరాల శుభ్రతపై సమావేశం ఏర్పాటు చేసి వారికి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు. ప్రజావాసాల్లో చెత్త, చెదారం పారవేయకుండా తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.